క్లుప్తంగా

ఘనంగా లక్ష కుంకుమ పూజలు



లక్ష కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

గజపతినగరం: గజపతినగరం శ్రీరామ క్షేత్రం ఆలయంలో శుక్రవారం లక్ష కంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో మహిళలు ఆలయానికి చేరుకొని లక్ష కుంకుమ పూజలు చేశారు.

రెడ్‌క్రాస్ సాయం



బాధితుడికి దుప్పట్లు, టార్పాలిన్లు అందచేస్తున్న సర్పంచ్

దత్తిరాజేరు: మండలంలోని టి.భూర్జవలసలో కొద్దిరోజుల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన కలిశెట్టి ఆదినారాయణకు రెడ్ క్రాస్ తరఫున దుప్పట్లు, టార్పాలిన్లు అందచేసినట్లు రెడ్‌క్రాస్ ప్రతినిధి రాము శుక్రవారం తెలిపారు. సర్పంచ్ మంత్రి క్రాంతికుమార్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ బి.రాజేశ్వరి, తదిరులు పాల్గొన్నారు.

శ్రీరాముడి అక్షతల పంపిణీ



వేపాడలో ఇంటింటికీ అక్షతలు పంపిణీ చేస్తున్న అర్చకులు, భక్తులు

వేపాడ: అయోధ్యలో రామ మందిరం ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని శ్రీరాముని దివ్య అక్షతలను గ్రామాల్లో ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. ఈ నెల 22న జరిగే అయోధ్య శ్రీరామ మందిరం ప్రతిష్ఠ నేపథ్యంలో సమరసత సవా ధర్మ ప్రచారక్ అందచేసిన అక్షతలను అర్చకులు గోపాజోస్యుల సాయిరాంశర్మతో పాటు పలువురు భక్తులు వేపాడ, బొద్దాం గ్రామాల్లో ఇంటింటికీ పంపిణీ చేశారు. అయోధ్య మందిరం ప్రారంభోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

చీపురుపల్లి రూరల్(గరివిడి): మండలంలోని కాపుశంబాం, కోడూరు గ్రామాల్లో శుక్రవారం 'వికసిత్ భారత సంకల్పయాత్ర' నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు మణిపూరి శ్రీనివాసరావు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ప్రధాని నరేంద్రమోడీ కృషితో దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు.

20 మద్యం సీసాలు పట్టివేత



పట్టుకున్న మద్యం సీసాలతో పోలీసులు

వేపాడ: మండలంలో బొద్దాం జంక్షన్ వద్ద వల్లంపూడి పోలీసులు శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 20 మద్యం సీసాలు పట్టుబడ్డాయి. క్లోపల్లి గ్రామానికి చెందిన జి.రామకృష్ణ వద్ద 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై బి.వి.రమణ తెలిపారు. అదేవిధంగా కొండగంగుబూడి సమీపంలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. ఐదుగురు పందెంరాయుళ్లను పట్టుకుని వారి వద్ద రూ.6700 నగదు, కోడి పుంజులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

పేకాట శిబిరాలపై దాడులు

విజయనగరం క్రైమ్: పేకాట శిబిరాలపై జిల్లా పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి పెద్ద చెరువు రోడ్డులో పేకాటాడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 36,635 రూపాయల నగదు.. గురజాడ అప్పారావు రోడ్డులో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రూ. 34,420 నగదు.. ఎస్ఆర్ఐ ఆస్పత్రి సమీపంలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని 18, 200 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. అదేవిధంగా టూటౌన్ పరిధి కస్పా హైస్కూల్ సమీపంలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.13,370 నగదు స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ ఎస్సై షేక్ శంకర్ తెలిపారు.

పేదల ఆశాజ్యోతి సీఎం జగన్



ఎస్.కోట: మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్ లబ్ధిదారులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



వేపాడ: కృష్ణారాయుడుపేటలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, తదితరులు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు
- పింఛన్ రూ.3 వేలకు పెంచడంతో అవ్వాతాతల్లో ఆనందం



దత్తిరాజేరు: చినకాదలో లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న ఎంపీపీ సింహాద్రిఅప్పలనాయుడు



లక్కవరపుకోట: రేగ సచివాలయంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి



కొత్తవలస: గనిశెట్టిపాలెంలో పింఛన్ డబ్బులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



మెరకముడిదాం: ఎం.పాలెంలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న కేఎస్‌ఆర్‌కే ప్రసాద్, తదితరులు



గజపతినగరం: పింఛన్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ గార తవుడు, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక

కొత్తవలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోన్‌రెడ్డి పేదల ఆశాజ్యోతి అని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సంతపాలెం, గులివిందాడ గ్రామ సచివాలయాల పరిధిలో శుక్రవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో సామాజిక పింఛన్ రూ.3 వేలు అందిస్తున్నారని, ఈ ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని అన్నారు. రానున్న ఎన్నికల్లో మరోమారు జగన్‌మోన్‌రెడ్డికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. అలాగే రామలింగాపురంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ బొంతల వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, సర్పంచ్‌లు బి.చాముండేశ్వరి, వెంకటరమణ, జామి ఈశ్వరరావు పాల్గొన్నారు. లక్కవరపుకోట మండలంలో పలు గ్రామాల్లో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందజేశారు.

మాట తప్పని నాయకుడు వైఎస్ జగన్

శృంగవరపుకోట: మాట తప్పని, మడమ తిప్పని నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శేషుబాబుతో కలిసి కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు శుక్రవారం పింఛన్ డబ్బులు అందజేశారు. పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచడం ద్వారా అవ్వాతాతల ముఖాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంతోషాలు నింపారని అన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో పంఛన్ మంజూరు చేయాలని అధికారులు, నాయకులను ఎన్నిసార్లు కోరినా పట్టించుకోలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉన్న వారికి ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు అండగా జగనన్న ప్రభుత్వం

దత్తిరాజేరు: ప్రతీ నెల ఒకటో తేదీన ఉదయాన్నే పింఛన్ అందచేస్తూ అవ్వాతాతలకు, వితంతువులు, దివ్యాంగులకు జగనన్న ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు అన్నారు. చినకాదలో శుక్రవారం ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంతో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు మురార్జీ, సన్యాసిరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో కొత్త పింఛన్ల పండుగ

వేపాడ: మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. కుమ్మపల్లి, కృష్ణారాయుడుపేటలో శుక్రవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ సత్యవంతుడు, సర్పంచ్‌లు బాలబాబు, అరుణ, మాజీ సర్పంచ్ పైడిబాబు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. దబ్బిరాజుపేటలో జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, సర్పంచ్ ముత్యాలమ్మ, ఆతవలో సర్పంచ్ వేమననాయుడు, శింగరాయిలో సర్పంచ్ సంఘం మండల అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, ఎంపీపీ సత్యవంతుడు, డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు పింఛన్లు అందచేశారు. వావిలపాడులో సర్పంచ్ బీల రాజేశ్వరి పింఛన్లు పంపిణీ చేశారు.

మెరకముడిదాం: పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ సభ్యుడు కేఎస్‌ఆర్‌కే ప్రసాద్ అన్నారు. మండలంలోని ఎం.పాలెంలో లబ్ధిదారులకు శుక్రవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో పింఛన్ల కోసం జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హుల వద్దకే వచ్చి పింఛన్లు, ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నారని అన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే సీఎంగా గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు కొమ్ము శంకరరావు, మాజీ సర్పంచ్ లెంక భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచి అవ్వాతాతలకు ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారని జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అన్నారు. గజపతినగరం-1, 2 గ్రామ సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు శుక్రవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుల, మత, వర్గ బేధాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు, ప్రభుత్వ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం తుమికాపల్లి, కెంగువ, జిన్నాం గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, స్థానిక సర్పంచ్ నరవ కొండమ్మ, వైస్ ఎంపీపీ కర్రి శ్రీదేవి, వైస్ ప్రెసిడెంట్ కర్రి రామునాయుడు, పంచాయతీ సెక్రటరి రమణ, సీనియర్ నేతలు కర్రి నానాజీ, శీర రమణ పాల్గొన్నారు.

పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి



చీపురుపల్లి: లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే పేదలకు రూ.3 వేలు పింఛన్ అందిస్తున్న ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అలజంగి సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొని కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు రూ.3 వేలు చొప్పున నగదు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషిచేస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ జెండాలు మోసేవారికే పింఛన్లు మంజూరు చేసేవారని, లంచాలు ఇవ్వందే పథకాలు అందేవి కాదని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా, అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు, సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. 2019కి ముందు రాష్ట్ర వ్యాప్తంగా 28.35 లక్షల పింఛన్లు ఉంటే మన ప్రభుత్వంలో వాటిని 66 లక్షలకు పెంచినట్లు చెప్పారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య ఖర్చును రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచినట్లు చెప్పారు. అలజంగి సచివాలయం పరిధిలోనే రూ.14 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మాయమాటలతో మరోసారి మోసం చేసేందుకు టీడీపీ నాయకులు వస్తారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పేదలకు అండగా నిలుస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, వైఎస్సార్‌సీపీ నాయకులు అనంత్, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, దాన్నాన జనార్దన్, పతివాడ రాజారావు, రఘుమండ త్రినాథ్, రెవల్ల సత్తిబాబు, గ్రామ సర్పంచ్ రఘుమండ రమణమ్మ, ఎంపీడీఓ జి.గిరిబాల, ఈఓపీఆర్డీ అన్నపూర్ణాదేవి, వెలుగు ఏపీఎం ఎంవీ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి మణి, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



గర్భాంలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ గాబ్రియల్, వేణుగోపాలరావు

మెరకముడిదాం: పాడిరైతులు తమ వద్ద ఉన్న పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి సీహెచ్.హైమవతి సూచించారు. మండలంలోని గర్భాం, సోమలింగాపురం గామాల్లో పశువులకు శుక్రవారం గాలికుంటువ్యాధి టీకాలను వేశారు. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, సర్పంచ్ గాబ్రియల్, ఎస్.కృష్ణమూర్తిరాజు ప్రారంభించారు. వైద్యాధికారి హైమావతి మాట్లాడుతూ.. గర్భాంలో 423 పశువులకు, సోమలింగాపురంలో 311 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. గాలికుంటువ్యాధి టీకాలను 4 నెలలు వయసు పైబడిన దూడల నుంచి పెద్ద పశువులు వరకు ఈ టీకాలు వేయించాలని సూచించారు. ఈ టీకాలను వేయించడం వలన నోటి సంచలు, కాలి సంచలు రాకుండా నిరోధించవచ్చన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ టీకాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరోగ్య సురక్షతో ఇంటి ముంగిటకే వైద్యసేవలు



దత్తిరాజేరు: పెదకాదలో 'ఆరోగ్య సురక్ష-2' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు



బొండపల్లి: ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ చలంనాయుడు, జెడ్పీటీసీ సూర్యప్రకాశరావు



చీపురుపల్లి రూరల్: గరివిడి జెడ్పీహెచ్ఎస్ వద్ద జగనన్న ఆరోగ్య శిబిరంలో రోగులకు మందుల కిట్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కృష్ణంనాయుడు

చీపురుపల్లి రూరల్(గరివిడి): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంటి ముంగిటకే వైద్యసేవలను తీసుకొచ్చిందని జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొణిశ కృష్ణంనాయుడు అన్నారు. గరివిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్నారు. శిబిరానికి వచ్చిన రోగులకు వైద్యాధికారి దీప్తి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ సత్యంనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.కుమార్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

బొండపల్లి: రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు అన్నారు. మండల కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్, ఈఓపీఆర్డీ సుగుణకరరావు, వైస్ ఎంపీపీ గొండేల ఈశ్వరరావు, సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు, ఎంపీటీసీ బండారు శ్రీను, బొండపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ధ్యేయం

దత్తిరాజేరు: పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం అని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు అన్నారు. పెదకాద ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడత కార్యక్రమం మంచి ఫలితాలు ఇవ్వడంతో ఇప్పుడు రెండో విడత కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సుమారు 180 మందికి రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా చేయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ మండల శ్రీను, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, గొభ్యాం సర్పంచ్ లక్ష్మునాయుడు, పెదకాద ఉప సర్పంచ్ సామిరెడ్డి ఈశ్వరరావు, సచివాల కన్వీనర్ కుమార్ నాయుడు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీలు

గంట్యాడ: అంగన్‌వాడీ సిబ్బంది విధుల్లో చేరుతున్నారు. సమ్మె కారణంగా బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు సకాలంలో సేవలు అందక ఇబ్బంది పడుతుండడంతో వెంటనే అంగన్‌వాడీ సిబ్బంది విధుల్లో చేరాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మండలంలోని పెద్దవేమలి అంగన్‌వాడీ కేంద్రం-1లో పనిచేస్తున్న సిబ్బంది శుక్రవారం విధుల్లో చేరినట్లు సీడీపీఓ డోకుల ఉమాభారతి తెలిపారు.

బ్లాక్ లిస్ట్‌లో రైస్ మిల్లు

గుర్ల: మండలంలోని కోటగండ్రేడులో ఉన్న శ్రీవాసవి రైస్ మిల్లును బ్లాక్ లిస్ట్‌లో పెట్టినట్లు సీఎస్‌డీటీ శోభ శుక్రవారం తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు కాకుండా అధికంగా ధాన్యం తీసుకుంటున్నట్లు రైతుల నుంచి అనేక ఫిర్యాదు రావడంతో ఈ మిల్లును బ్లాక్ లిస్ట్‌లో పెట్టినట్లు చెప్పారు. రైతుల నుంచి ధాన్యం అధికంగా తీసుకున్న మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

10,371 మందికి వైద్యం

విజయనగరం ఫోర్ట్: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 29 వైద్య శిబిరాలు నిర్వహించారు. 10,371 మందికి వైద్యులు, సిబ్బంది సేవలందించారు. అవసరమైన మందులు అందజేశారు. బీపీరోగులు 461 మంది, షుగర్ వ్యాధిగ్రస్తులు 3,926 మంది వైద్యసేవలు పొందారు. 12,397 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'



వేపాడ: రామస్వామిపేటలో క్రీడాకారులకు పరిచయం చేసుకుంటున్న సర్పంచ్‌లు జగ్గుబాబు, శర్మ

గజపతినగరం: 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. సీతారామపురం, శ్రీరంగ రాజపురం, కాలంరాజుపేట గ్రామ సచివాలయాలకు చెందిన యువత ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గేదెల ఈశ్వరరావు, గేదెల జగదీశ్వరరావు, గిడిజాల కామునాయుడు పోటీలను ప్రారంభించారు. సీతారామపురం గ్రామ సచివాలయం నుంచి రెండు జట్లు పాల్గొనగా.. అందులో మొదటి జట్టు విజయం సాధించింది. అలాగే కాలంరాజు పేట, డోళపాలెం గ్రామాల మధ్య జరిగిన పోటీలో డోళపాలెం జట్టు విజయం సాధించినట్టు పీఈటీలు సత్యనారాయణ, శ్రీనివాసరావు తెలిపారు. విజయం సాధించిన క్రీడాకారులను గ్రామపెద్దలు తుంపిల్లి జనార్దనరావు, గేదెల ఈశ్వరరావులు, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు

వేపాడ: మండలంలో రామస్వామిపేట సచివాలయం పరిధిలో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలను సర్పంచ్‌లు ముమ్మలూరి జగ్గుబాబు, వడ్లమాని శర్మ శుక్రవారం ప్రారంభించారు. కబడ్డీ క్రీడాకారులు, షటిల్ కాక్ పోటీలు నిర్వహించారు. క్రీడలతో ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేస్తాం..

- ఎమ్మెల్సీ రఘురాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: జిందాల్ కంపెనీ ఏర్పాటు కోసం భూములిచ్చి నిరాశ్రయులైన నిర్వాసితుల పక్షాన తాను ఉంటానని, గతంలో జిందాల్ కంపెనీ ప్రకటించిన పరిహారం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్సీ రఘురాజు అన్నారు. బొడ్డవరలో సాయిగణేష్ ఫంక్షన్ హాలులో మూలబొడ్డవర, కిల్తంపాలెం, పెదఖండేపల్లి, ముషిడిపల్లి పంచాయతీల్లో జిందాల్ కోసం భూములు ఇచ్చిన నిర్వాసిన రైతులు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నిర్వాసితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. గతంలో తాను రైతుల పక్షాన జిందాల్ యాజమాన్యానికి వ్యతిరేకంగా పోరాటం చేశానని, నిర్వాసితుల సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించానని గుర్తుచేశారు. నిర్వాసితులు, ఈ ప్రాంత రైతులకు న్యాయం చేయాలని సీఎం జగన్ ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు అనుమతిచ్చారని అన్నారు. నిర్వాసితులకు కంపెనీ తరఫున అందాల్సిన పరిహారం పూర్తిస్థాయిలో అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయా పంచాయితీల నాయకులు, రైతులు ఎమ్మెల్సీ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు, జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు డి.సంతోషికుమారి, యాల్ల రమణ, ఎంపీటీసీ బి.దేముడు, తదితరులు పాల్గొన్నారు.

దేవానందస్వామి ఆరాధనోత్సవం రేపు

బొండపల్లి: మండలంలోని కొవ్వాడపేట గ్రామంలో ఆదివారం సద్గురు దేవానంద స్వామి 24వ ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమారాధన ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.